క్లుప్తంగా

అకడమిక్ వీసీని నియమించాలి

కేయూ క్యాంపస్ : అకడమిక్ అనుభవం ఉన్న వారినే కాకతీయ యూనివర్సిటీ వీసీగా నియమించాలని కేయూ అధ్యాపకుల సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ మామిడాల ఇస్తారి కోరారు. ఈమేరకు గురువారం కేయూ సెర్చ్ కమిటీకి ఈమెయిల్ ద్వారా లేఖ పంపారు. యూనివర్సిటీలోని హాస్టళ్లు, పరిపాలనపరమైన సమస్యలున్నాయన్నారు. అకాడమిక్ పరిశోధనల అనుభవం కలిగిన వారినే వీసీగా నియమించాలని సెర్చ్ కమిటీ మెంబర్లకు పంపిన లేఖలో ఇస్తారి కోరారు.

6న చిత్రలేఖనం, మట్టిబొమ్మల తయారీ పోటీలు

హన్మకొండ చౌరస్తా: బతుకమ్మ, దసరా పండుగలను పురస్కరించుకుని సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈనెల 6వ తేదీన హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో చిత్రలేఖనం, మట్టి బొమ్మల తయారీపై పోటీలు నిర్వహించనున్నట్లు అకాడమీ డైరెక్టర్ సాగంటి మంజుల గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రతినెలా నిర్వహించే చిత్రలేఖన పోటీలతో పాటు ఈసారి డ్యూయల్ రోల్ పేరుతో రెండు అంశాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. పూర్తి వివరాలకు 81436 43337 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఏఐసీడబ్ల్యూసీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా సుదర్శన్



ఖిలా వరంగల్: జాతీయ సమాఖ్య ఏఐసీడబ్ల్యూసీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా శివనగర్‌కు చెందిన మొగిలిచెర్ల సుదర్శన్ నియమితులయ్యారు. ఈమేరకు నియామక ఉత్తర్వులు అందుకున్నట్లు ఆయన తెలిపారు.

సునీతకు డాక్టరేట్



కేయూ క్యాంపస్: హైదరాబాద్‌లోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగంలో హనుమకొండకు చెందిన గుడిపెల్లి సునీతకు వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఇన్నోవేషన్స్ ఇన్ బ్యాంకింగ్ సెక్టార్ – ఏ స్టడీ ఆఫ్ సెలెక్ట్ బ్యాంక్స్ అనే అంశంపై ప్రొఫెసర్ దీపశ్రీ పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి సునీత డాక్టరేట్ అందుకున్నారు.

శంభునిపేటలో గ్యాంగ్‌వర్క్

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలోని విశ్వనాథ కాలనీలో పారిశుద్ధ్య సిబ్బంది గురువారం గ్యాంగ్ వర్క్ నిర్వహించారు. బతుకమ్మ సంబురాల్లో భాగంగా అభయాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణం పూలతో నిండిపోయింది. దాంతో పూలు, వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని ట్రాక్టర్లలో నింపి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. కార్యక్రమంలో బల్దియా అధికారులు, సిబ్బంది, ఆలయ చైర్మన్ కర్నె రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

యూపీహెచ్‌సీ బకాయిలు చెల్లించాలి

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం న్యూశాయంపేటలోని యూపీహెచ్‌సీ (అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్)కి బకాయి ఉన్న నిధులను ప్రభుత్వం కేటాయించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు యూపీహెచ్‌సీని సీపీఐ హనుమకొండ కమిటీ నాయకుడు వేల్పుల సారంగపాణి ఆధ్వర్యంలో పలువురు గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 నెలలుగా ఆస్పత్రికి రావాల్సిన నిధులు రాకపోవడంతో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు అందడం లేదని వాపోయారు.

58వ డివిజన్ రాఘవేంద్ర కాలనీ ఫేజ్ -2లో కల్వర్టు నిర్మించండి

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్ రాఘవేంద్ర కాలనీలో ఫేజ్ -2 రోడ్డు నంబర్ 2/ఏ నుంచి 2/ఎఫ్ వరకు కల్వర్టు, సీసీ రోడ్డు, ఇరువైపులా డ్రెయినేజీ నిర్మించాలని కాలనీ వాసులు ఈ.కుమారస్వామి, ఏ.రవి, ఎండీ.సర్వర్, సుధాకర్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2018లో రోడ్డు నంబర్ 2/ఏ వద్ద సీసీ రోడ్డు వేసిన అధికారులు దానిపైన కల్వర్ట్ వేయలేదని తెలిపారు. కాలనీలో ఎక్కువశాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలకు చెందిన వారే ఉంటున్నట్లు పేర్కొన్నారు. వర్షాకాలంలో కాలనీ మొత్తం జలమయం అవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మంగ, వసంత, రజిత, చైతన్య, శివ పాల్గొన్నారు.

కాజీపేట డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన జేఏసీ నాయకులు

వరంగల్ అర్బన్: కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్‌ను గ్రేటర్ వరంగల్ జేఏసీ నూతన కార్యవర్గం సభ్యులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గానికి డిప్యూటీ కమిషనర్ అభినందనలు తెలిపారు. జేఏసీ గౌరవ అధ్యక్షుడు బిర్రు శ్రీనివాస్, అధ్యక్షుడు బొట్ల రమేష్, ప్రధాన కార్యదర్శి బాకం సంతోష్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజరాపు భాస్కర్, కార్యదర్శి బానోతు బాలునాయక్, ఆర్‌ఐలు గడ్డం దేవరాజ్, చిలుక సురేష్, జూనియర్ అసిస్టెంట్లు పులిశేఖర్, సత్యం పాల్గొన్నారు.

ఎర్రగట్టు గుట్ట వద్ద ట్రాఫిక్ అస్తవ్యస్తం



నగరంలోని ఎర్రగట్టు గుట్ట క్రాస్ వద్ద ట్రాఫిక్ నిత్యం అస్తవ్యస్తంగా మారుతోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో వాహనదారులు, ప్రయాణికులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం 8.30 గంటల నుంచి 10గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి 5.30 గంటల వరకు వాహనాల రద్దీతో ఈ కూడలి రద్దీగా ఉంటోంది. ఆ వేళల్లో పాఠశాలలు, కళాశాలల బస్సులు, భారీ వాహనాల రాకపోకలతో ట్రాఫిక్ జామవుతోంది. ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థ లేకపోవడంతో ట్రాఫిక్‌ను నియంత్రించడానికి కానిస్టేబుల్‌ను కూడా నియమించలేదు.

– హసన్‌పర్తి

దేవాలయాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం



శరన్నవరాత్రులను ప్రారంభిస్తున్న మంత్రి సురేఖ

కాశిబుగ్గ: రాష్ట్రంలోని పురాతన దేవాలయాలను అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రాష్ట్ర దేవాదాయ, అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ సత్యాశారదతో కలిసి దయానందకాలనీ సమీపంలోని కనకదుర్గ మాత దేవాలయంలో దేవి శరన్నవరాత్రి మహోత్సవాలను గురువారం కొండా సురేఖ ప్రారంభించారు. అమ్మవారికి పూజలు చేసిన అనంతరం ఆమె మాట్లాడారు. కాకతీయుల కాలంలో నిర్మించిన పురాతన దేవాలయాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మీసాల ప్రకాశ్, దేవాదాయ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రావు, అసిస్టెంట్ కమిషనర్ రామాల సునీత, సింగిరి కొండ వెంకటేశ్వర్లు, సర్వారియా సురేశ్‌కుమార్, కొప్పుల సరోజన, జంగం ప్రభాకర్, గూడ శారద, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల ఏర్పాట్ల పరిశీలన

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు గుట్ట రంగలీలమైదానంలో బల్దియా, పలు శాఖల అధికారుల ఆధ్వర్యంలో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాల ఏర్పాటు పనులు గురువారం ప్రారంభమయ్యాయి. ఈమేరకు ఉత్సవాల ఏర్పాట్లను ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపూరి సంజయ్‌బాబు, సభ్యులతో కలిసి పలు శాఖల అధికారులు పరిశీలించారు. వర్షం వచ్చినా విద్యుత్ సమస్య తలెత్తకుండా తగిన ఏర్పాట్లుతోపాటు భారీ జనరేటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు అధికారులు విద్యుత్ శాఖ ఈఈ మహేందర్ తెలిపారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు సారంగం, రాజ్‌కుమార్, ముజమిల్, నరేష్, ఉత్సవ కమిటీ ప్రతినిధులు మేడిది మధుసూదన్, మండ వెంకన్న, శివమూర్తి, వంగరి కోటేశ్వర్, ఉపాధ్యక్షులు గొనె రాంప్రసాద్, రంజిత్, వెంకటేశ్వర్లు, వాసు తదితరులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు

కాశిబుగ్గ: సద్దుల బతుకమ్మకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. లేబర్‌కాలనీ సమీపంలోని గొర్రెకుంట కట్టమల్లన్న చెరువులో పేరుకుపోయిన వ్యర్థాలు, గుర్రపు డెక్కను మున్సిపల్ సిబ్బంది గురువారం తొలగించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వస్కుల బాబు మాట్లాడుతూ మహిళలకు అత్యంత ఇష్టమైన బతుకమ్మ పండుగ కోసం ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోందని వివరించారు. అందులో భాగంగానే చెరువులు, కుంటల వద్ద శుభ్రం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ భాస్కర్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భూకబ్జా కుట్ర ఫలించకుంటే స్థల ఆక్రమణ అవుతుందా?



మాట్లాడుతున్న సత్యనారాయణ రెడ్డి

హన్మకొండ: భూకబ్జా చేయాలనే కుట్ర ఫలించకుంటే ఆ స్థలం ఆక్రమించుకున్నట్లు అవుతుందా అని, లే అవుట్ అనుమతి లేని కాలనీకి కమ్యూనిటీ స్థలం ఎక్కడి నుంచి వస్తుందని శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు కటంగూరి సత్యనారాయణ రెడ్డి ప్రశ్నించారు. హనుమకొండ కేఎల్‌ఎన్ రెడ్డి కాలనీలోని శ్రీరామకృష్ణ సేవా సమితి కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. కుడా, మున్సిపల్ కార్పొరేషన్ అనుమతితో, ప్రభుత్వ నిబంధనలతో శ్రీరామకృష్ణ సేవా సమితి ధాన్య మందిరం నిర్మించినట్లు తెలిపారు. ఈ స్థలం కేఎల్‌ఎన్.రెడ్డి కాలనీకి చెందిన కమ్యూనిటీ హాల్ కోసం కేటాయించిన స్థలమని 15 ఏళ్లుగా కాలనీ వాసులను రెచ్చగొట్టి, పెడదారి పట్టిస్తున్న వ్యక్తి పిరమిడ్ సొసైటీ ప్రధాన బాధ్యుడు అని ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. సమావేశంలో శ్రీరామకృష్ణ సేవా సమితి ప్రధాన కార్యదర్శి జి.విష్ణువర్ధన్ రెడ్డి, సభ్యులు కె.శ్రీనివాస స్వామి, కేవీ.రావు, కె.సూర్య, చిదర అంజనీదేవి, పడిదల అనిత, బోయినిపల్లి పార్వతి పాల్గొన్నారు.

'పిడుగుపాటు బాధితులకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి'



బాధితులతో మాట్లాడుతున్న రావు పద్మ

హన్మకొండ: పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఒక్కో బాధిత కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ డిమాండ్ చేశారు. పిడుగుపాటుకు గురై మృతి చెందిన ఆత్మకూరు మండలం చౌళ్లపల్లికి చెందిన వ్యవసాయ కూలీ ఇటుకాల నిర్మల, సోలెంక రాము కుటుంబాలను వరంగల్ ఎంజీఎంలో గురువారం పరామర్శించారు. బాధిత కుటుబాలకు తక్షణ సహాయంగా రూ.5 లక్షలు వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు డాక్టర్ పెసరు విజయ్‌చందర్ రెడ్డి, డాక్టర్ పగడాల కాళీప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు గురిజాల శ్రీరాంరెడ్డి, నాయకుడు ఎదులాపురం శ్రావణ్ పాల్గొన్నారు.


కుటుంబ పెద్దను కాపాడిన పోలీసులు



బాధితులతో వరంగల్ రైల్వేస్టేషన్‌లో పోలీసులు

వరంగల్: కేరళ రాష్ట్రం నుంచి బతుకుదెరువు కోసం ఇక్కడికి వచ్చి వేతనం సరిపోక కుటుంబాన్ని పోషించలేక జీవితం మీద విరక్తి చెంది ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ఆ కుటుంబ యజమాని తన బంధువులకు మెసేజ్ పెట్టాడు. ఆ విషయాన్ని వారు వరంగల్ ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అందించడంతో ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ తన సిబ్బందితో రంగంలోని దిగి కుటుంబ పెద్దను కాపాడిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కేరళ రాష్ట్రానికి చెందిన సౌమ్య, మను భార్యాభర్తలిద్దరు కురవి మండల కేంద్రంలోని సిద్ధార్థ స్కూల్లో ప్రైవేటు టీచర్లుగా పనిచేస్తూ తమ కూతురును అదే స్కూల్లో చదివిస్తున్నారు. అక్కడ వాళ్లకు వచ్చే జీతం సరిపోక వరంగల్‌లో ఏదైనా స్కూల్లో ఉద్యోగం చూసుకుందామని నాలుగు రోజులుగా లాడ్జిలో ఉంటూ తిరుగుతుండగా ఎలాంటి ఉద్యోగం దొరకలేదు. దాంతో తీవ్ర నిరాశకు గురైన కుటుంబ యజమాని ఆత్మహత్యకు యత్నించగా పోలీసులు కాపాడారు.

ఈఎల్‌ఎస్ పార్కులో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే ఈఎల్‌ఎస్ పార్కులో ఐఎన్‌టీయూసీ హనుమకొండ జిల్లా వైస్ ప్రెసిడెంట్ యమడాల హనుకాంత్ ఆధ్వర్యంలో రాజీవ్ ఆరోగ్యశ్రీ, హెల్త్‌కార్డు కేవైసీ నమోదు, వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకుడు విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటోందని అన్నారు. యూపీహెచ్‌సీ వైద్యుడు వివేక్ పాల్గొని వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీఎస్‌సీ డిస్ట్రిక్ మేనేజర్ పవన్ ఆధ్వర్యంలో 145మందికి రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్‌కార్డు కేవైసీ నమోదు చేసినట్లు హనుకాంత్ తెలిపారు. అజ్గర్, ఎండీ.బిలాల్, బందెల చందు, ఇప్ప శ్రీకాంత్, సిరిల్‌లారెన్స్, ఇమ్మడి మధు, మజరుద్దీన్, పోగుల శ్రీనివాస్, లక్ష్మణ్, భిక్షపతి, శరత్ పాల్గొన్నారు.

గ్యాస్ లీకేజీతో అగ్ని ప్రమాదం

ఖిలా వరంగల్: వరంగల్ శంభునిపేటలోని విశ్వనాథ కాలనీలో స్వల్ప అగ్ని ప్రమాదం సంభవించింది. మడూర్ కిరణ్‌కు చెందిన ఇంటిలో గురువారం మధ్యాహ్నం గ్యాస్‌పైపు లీకేజీతో ఒక్కసారి మంటలు ఎగిసిపడ్డాయి. దాంతో ఇంట్లోని కుటుంబ సభ్యులందరు రోడ్డుపైకి పరుగులు పెట్టారు. స్థానికులు అప్రమత్తమై వరంగల్ ఫైర్ స్టేషన్, మిల్స్‌కాలనీ పోలీసులకు సమాచారం ఇచ్చారు. సమాచారం అందుకున్న ఫైర్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎగిసి పడిన మంటలను క్షణాల్లో అదుపులోకి తెచ్చారు.

మద్యం స్వాధీనం

వరంగల్: అనుమతులు లేకుండా విక్రయిస్తున్న అంబి ఉమ, అంబిలతల నుంచి రూ.9200 విలువ గల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రవికుమార్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు వరంగల్ లక్ష్మీపురంలో నిందితుల ఇంటిపై దాడి చేయగా మద్యం లభించిందని పేర్కొన్నారు. అనంతరం వారిని తదుపరి చర్యల నిమిత్తం ఇంతేజార్‌గంజ్ పోలీసులకు అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

రూ.23,820ల మద్యం సీజ్

ఖిలా వరంగల్: శాకరాశికుంటలోని జూలూరి శ్రీధర్‌కు చెందిన పాన్ షాపు, ఇంటిలో దాడిచేసి రూ.23,820 విలువైన మద్యాన్ని సీజ్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

వృద్ధురాలి అదృశ్యం

ఖిలా వరంగల్: వరంగల్ ఉర్సు కరీమాబాద్‌కు చెందిన 70 ఏళ్ల వృద్ధురాలు అదృశ్యమైనట్లు ఎస్సై సురేష్ తెలిపారు. ఉర్సు ప్రాంతానికి చెందిన ఎండీ.ఖాదర్ తల్లి అఫ్జల్ బీ (70) మతిస్థిమితం సరిగాలేదు. బుధవారం సాయంత్రం ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. బంధువుల ఇళ్లు, బస్టాండ్, రైల్వేస్టేషన్, రహదారులపై వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. ఖాదర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సహకారం అందించాలి

వరంగల్ / కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గ చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద జరగనున్న సద్దుల బతుకమ్మ, రావణసుర వధ, దసరా ఉత్సవాలకు సహకారం అందజేయాలని కాశిబుగ్గ దసరా ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు. ఈమేరకు హనుమకొండ ఆర్ అండ్ బి గెస్ట్ హౌజ్‌లో మంత్రి కొండా సురేఖను గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్షుడు దూపం సంపత్, కన్వీనర్ బయ్యా స్వామి, ప్రధాన కార్యదర్శి సముద్రాల పరమేశ్వర్, ఓని భాస్కర్, బాంబుల కుమార్, ఓం ప్రకాష్ కోలారియా, చిలువేరు శ్రీనివాస్, సిద్దోజు శ్రీనివాస్, వేముల నాగరాజు, దాసరి రాజేష్, కూచన రవీందర్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

వరంగల్ చౌరస్తా: వరంగల్‌లోని గోవిందరాజుల గుట్ట దేవాలయంలో అర్చకుల మధ్య తగాదాలను స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్, ఆయన సోదరుడు చింతాకుల సునీల్ సృష్టిస్తున్నారని అర్చకులు విమర్శించారు. ఈమేరకు రాష్ట్ర అటవీ, దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖను గురువారం కలిసి ఫిర్యాదు చేశారు. వరంగల్‌లోని కనకదుర్గ దేవాలయాన్ని సందర్శించిన మంత్రికి అర్చకులు వరయోగుల శ్రీనివాస్, మురళీకృష్ణ, ప్రసాద్ గోడును వెళ్లబోసుకున్నారు.

సాంస్కృతిక సంబురాలు

ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని ఏకశిలా డిజీ స్కూల్‌లో డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి ఆధ్వర్యంలో గురువారం సాంస్కృతిక సంబురాలు జరిగాయి. బతుకమ్మ వేడుకల్లో భాగంగా సంప్రదాయ దుస్తులను విద్యార్థులు ధరించారు. వారు చేసిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నారు.

ఎన్‌సీసీ కేడెట్లకు కఠోర శిక్షణ



శిక్షణలో మాట్లాడుతున్న రామదురై

కేయూ క్యాంపస్: ఎన్‌సీసీ కేడెట్లకు కఠోర శిక్షణ ఇస్తున్నట్లు తెలంగాణ బెటాలియన్ కమాండెంట్ కల్నల్ ఎస్ఎస్ రామదురై తెలిపారు. 2025లో న్యూఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొనే వరంగల్, ఖమ్మం గ్రూప్‌స్థాయి కేడెట్స్‌కు శిక్షణ ప్రారంభించగా, ఈనెల 9వ తేదీవరకు కొనసాగనుంది. ఈ మేరకు గురువారం 40మంది ఎన్‌సీసీ కేడెట్స్ రక్తదానం చేసి, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం రామదురై మాట్లాడుతూ.. ఎన్‌సీసీ కేడెట్‌ను రెండో ఆర్మీగా పిలుస్తారని తెలిపారు. ఎంతో క్రమశిక్షణ కలిగిన ప్రత్యేకమైన కఠినమైన శిక్షణ తట్టుకొని దేశ రక్షణలో చురుకుగా పాల్గొనే కేడెట్లను ఎన్‌సీసీ ద్వారా ఆర్మీలోకి నేరుగా ప్రవేశాలు పొందుతారని రామదురై వెల్లడించారు. ఈ క్యాంపులో డిప్యూటీ కమాండర్ లెఫ్టినెంట్ కల్నల్ రవిసునారే, సుబేదారి మేయర్ సౌరస్య, కెప్టెన్ విజయ్, డాక్టర్ ఎస్.స్వామి, రాజమాణిక్యం, వాసు, అరుణ, కుమారస్వామి, సతీష్, మహేష్ వివిధ జిల్లాల నుంచి 500 మంది ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఉద్యమం



ఆవిర్భావ వేడుకలో సీఐటీయూ నాయకులు

హన్మకొండ: సామ్రాజవాదానికి వ్యతిరేకంగా, కార్మికవర్గ ఐక్యత కోసం, ప్రపంచ కార్మికులను ఐక్యం చేస్తూ, వారి హక్కుల కోసం ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌టీయూ) నిరంతరం పోరాటాలు చేస్తోందని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ అన్నారు. హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రపంచ కార్మిక సంఘాల సమాఖ్య 79వ ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారానికి ఐదు రోజులు, 35 గంటల పని దినం కోసం ప్రపంచవ్యాప్తంగా పోరాటాలు నడుస్తున్నాయని చెప్పారు. సామ్రాజ్యవాదం, బహుళజాతి కంపెనీలు కార్మికుల శ్రమను దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. ప్రపంచీకరణ విధానాలను ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు టి.ఉప్పలయ్య ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు పుల్లా అశోక్, బొల్లారం సంపత్, ఆలకుంట్ల యాకయ్య, నవనీత, ఎ.మల్లయ్య, ఎం.శ్రీనివాస్, నాగరాజు, రమ, సునీత, మణెమ్మ, లీల, కార్మికులు పాల్గొన్నారు.

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

హన్మకొండ: మహిళలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేస్తే తీవ్ర పరిణామాలు ఎదురుకోవాల్సి ఉంటుందని మహిళా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్ హెచ్చరించారు. రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖపై కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ హనుమకొండ ఎన్జీవోస్ కాలనీ రోడ్డులోని గోకుల్ కూడలిలో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేటీఆర్ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. కార్యక్రమంలో హనుమకొండ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బంక సంపత్ యాదవ్, మహిళా నాయకులు తేళ్ల సుగుణ, బొంత సుజాత, విజయ, బొల్లు భాగ్యలక్ష్మి, బి.మౌనిక, లక్ష్మి, కొమురమ్మ, సరస్వతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖ దిష్టిబొమ్మ దహనం



కాశిబుగ్గ: ధర్నా చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

రామన్నపేట: అక్కినేని కుటుంబ సభ్యులపై మంత్రి కొండా సురేఖ అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆమె భేషరతుగా క్షమాపణ చెప్పాలని అక్కినేని వంశ అభిమానుల సంఘం జిల్లా అధ్యక్షుడు సదాంత్ డిమాండ్‌చేశారు. ఈమేరకు పాపయ్యపేట చమన్‌లో మంత్రి సురేఖ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. కార్యక్రమంలో ఎండీ.జావీద్, మార్త కిరణ్, బొళ్ల శ్రీధర్, మేకల రాజు, సునీల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు. కాగా, అక్కినేని కుటుంబ సభ్యులపై చేసిన వ్యాఖ్యలను మంత్రి సురేఖ గురువారం ఉదయం ఉపసంహరించుకున్నారని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అయినప్పటికీ మంత్రి సురేఖ దిష్టిబొమ్మను ఉద్దేశపూర్వకంగానే బీఆర్‌ఎస్ 29వ డివిజన్ అధ్యక్షుడు సదాంత్ దహనం చేశారని, ఈక్రమంలో ఆయనపై చర్య తీసుకోవాలని పోలీసులకు కాంగ్రెస్ నాయకులు ఫిర్యాదు చేశారు. అలాగే, బీఆర్‌ఎస్ నాయకులపై కొండా యువసేన తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడు రేణికుంట్ల శివకుమార్ గురువారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

సవాల్ నిరూపిస్తావా.. క్షమాపణ చెబుతావా..?

కాశిబుగ్గ: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు సవాలును నిరూపిస్తావా.. లేక క్షమాపణ చెబుతావా అంటూ మంత్రి కొండా సురేఖపై మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ధ్వజమెత్తారు. ఈమేరకు వరంగల్ – నర్సంపేట ప్రధాన రహదారి క్రిస్టియన్‌కాలనీ తెలంగాణ జంక్షన్‌లో బీఆర్‌ఎస్ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ ఎంతో గౌరవం కలిగిన అక్కినేని కుటుంబాన్ని అవమానపర్చడం సమంజసమా అని ప్రశ్నించారు. ధర్నాలో కార్పొరేటర్లు దిడ్డి కుమారస్వామి, మరుపల్లి రవి, కుందారపు రాజేందర్ పాల్గొన్నారు.

ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు



శివనగర్‌లో..



వేడుకలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే



మడికొండలోని మహంకాళి ఆలయంలో..



చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో..

ఖిలా వరంగల్: శరన్నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో వరంగల్ శివనగర్‌లో సీతారామచంద్ర స్వామి దేవాలయంలోని లలితాదేవి అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో విశేషమైన పూజలు చేశారు. అనంతరం శైలపుత్రి (బాలా త్రిపురసుందరి) రూపంలో లలితాదేవి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో మంచాల కృష్ణమూర్తి, రావికంటి అశోక్, శ్రీరాం రాజేష్, నవీన్, అల్లాడి సాయిరాం, శైలజ, మంచాల నాగరాణి, శైలజ, రావికంటి శ్రీదేవి, ఓరుగంటి విమల, రాధిక పాల్గొన్నారు.

శృంగేరి పీఠంలో..

రామన్నపేట: వరంగల్ శృంగేరి శంకరమఠంలో శారద శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. వేడుకలను ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ప్రారంభించగా, మొదటి రోజు శంకరమఠం ప్రధాన అర్చకుడు సంగమేశ్వర జోషి పాల్గొని అమ్మవారికి పంచసూక్తులు, సకల నదీ జలంతో అభిషేకం చేసి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. అంతకుముందు డాక్టర్ పోల నటరాజు – శార్వాణి దంపతులు గణపతి హోమం నిర్వహించారు. బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్, నాయకులు అమ్మవారిని దర్శించుకున్నారు. శంకర్ సేవా సమితి సభ్యులు దేవేందర్, కుమారస్వామి, భాస్కర్, రాజేంద్రప్రసాద్, విజయ్, సర్వేశ్వర్, రవీందర్, వెంకటేశ్వర్ రావు, మహిపాల్, సందీప్, సంధ్యారాణి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

మడికొండలో..

మడికొండ: మడికొండలో దేవీ శరన్నవరాత్రోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. మడికొండ చౌరస్తాలో సుభాష్ యూత్ ఆధ్వర్యంలో, మహంకాళి ఆలయంలో, గౌడ సంఘం, వేణుగోపాలస్వామి ఆలయంలో, అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి మండపాల వద్ద అర్చకుల మంత్రోచ్ఛరణల మధ్య పంచామృతాభిషేకం, నవగ్రహ పూజ, అష్టదిక్పాలకుల పూజ చేశారు. మొదటి రోజు అమ్మవారు బాలత్రిపుర సుందరి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో అర్చకులు మంత్రవాది వెంకటప్రసాద్, రాగిచేడు అభిలాష్‌శర్మ, యూత్ సభ్యులు మద్దెల కుమార్, చెన్నమల్ల భాస్కర్, సాంబరాజు, నరేష్, దువ్వ సందీప్, వినయ్, సాయి, బుర్ర రాజ్‌కుమార్, బిన్ని, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కడిపికొండలో..

కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాసశర్మ ప్రత్యేక పూజలు జరిపించారు.

అనాథ వృద్ధుల సంరక్షణ అందరి బాధ్యత



వరంగల్ చౌరస్తా: వద్దుల సంరక్షణ అందరి బాధ్యత అని కాసం ఫౌండేషన్ సభ్యుడు కాసం దీక్షిత్ అన్నారు. మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా కాసం ఫౌండేషన్ ఆధ్వర్యంలో నగరంలోని ప్రధాన రహదారుల్లో ఉన్న అనాథ వద్దులకు బుధవారం సాయంత్రం దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కనిపెంచిన తల్లిదండ్రులను వద్ధాశ్రమాల్లో వదిలివేయకుండా, వారిని ఆప్యాయంగా చూసుకుంటూ ప్రేమానురాగాలు పంచాలన్నారు. చలికాలం వస్తున్నందున వృద్ధులకు దుప్పట్లు పంచుతూ వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు.